క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: కుందన్‌బాగ్‌, ఆల్విన్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జెక్‌కాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఆఫీస్‌, సెయింట్‌ థెరిసా హాస్పిటల్‌, బీఎస్‌ మక్తా, హుస్సేన్‌నగర్‌, నిషాంత్‌బాగ్‌ కాలనీ, హనుమాన్‌ టెంపుల్‌, సుభాని మసీదు ఏరియా, ఇండియన్‌ ఎక్స్‌ప్రెస్‌, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్‌ ఏరియా, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్‌, కుందన్‌బాగ్‌ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్‌ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ప్యారడైజ్‌ డివిజన్‌ పరిధిలో..

లాలాగూడ సబ్‌స్టేషన్‌ పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని ప్యారడైజ్‌ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినోభానగర్‌, ఇందిరానగర్‌, లాలాపేట్‌, గణేష్‌ టెంపుల్‌, ఇసుకబాయి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయపురి, చిల్డ్రన్స్‌ పార్కు రోడ్డు, ఓయూ క్వార్టర్స్‌, వాటర్‌ వర్క్స్‌ ప్రాంతాల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్‌ టికెట్‌ను బీసీలకు కేటాయించండి

ఉస్మానియా యూనివర్సిటీ: జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే టికెట్‌ను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ సీఎం రేవంత్‌ రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నేతలను కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నవీన్‌ యాదవ్‌కు జూబ్లీహిల్స్‌ టికెట్‌ ఇస్తే తేలికగా గెలుపొందుతారని తెలిపారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే టికెట్‌ లేదా సికింద్రాబాద్‌ ఎంపీ టికెట్‌ను ఇస్తామని హామీ ఇచ్చి పార్టీలో చేరుకున్నారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఆయనకు టికెట్‌ లభించలేదని, వచ్చే ఉప ఎన్నికలోనైనా నవీన్‌ యాదవ్‌కు టికెట్‌ ఇవ్వాలని కోరారు.

వెంకటయ్యకు ఓయూ డాక్టరేట్‌



బాణాల వెంకటయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్‌ విభాగం విద్యార్థి బాణాల వెంకటయ్య పీహెచ్‌డీ డాక్టరేట్‌ డిగ్రీ సాధించారు. కామర్స్‌ విభాగం హెడ్‌ ప్రొ.గంగాధర్‌ పర్యవేక్షణలో కస్టమర్స్‌ సాటిస్‌ఫ్యాక్షన్‌ టువర్డ్స్‌ ఎలక్ట్రానిక్స్‌ ప్రొడక్ట్స్‌: ఏ స్టడీ విత్‌ రిఫరెన్స్‌ టు ఈ–మార్కెట్‌ పోర్టల్స్‌ ఇన్‌ ట్విన్‌ సిటీస్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ అండ్‌ సికింద్రాబాద్‌ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్‌ లభించిందని తెలిపారు. నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటయ్యకు బాల్యంలోనే పోలియో వచ్చి దివ్యాంగుడు కాగా ఎంతో కష్టపడి చదివి ఎంకాంతో పాటు తెలంగాణ సెట్‌, యూజీసీ నెట్‌లో అర్హత సాధించాడు. తన చదువులకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వీధి దీపాలకు మరమ్మతులు

అంబర్‌పేట: డివిజన్‌లో వీధి దీపాల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లో పలు ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన వీధి దీపాలను కార్పొరేటర్‌ మరమ్మతులు చేయించారు. నందనవనం, బతుకమ్మకుంట తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో సైతం మరమ్మతులకు గురైన వీధి దీపాలను తక్షణమే మరమ్మతులు చేయిస్తానన్నారు.

స్కూల్‌ బ్యాగుల పంపిణీ

అంబర్‌పేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనకు 11 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం బీజేపీ నేతలు విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌ రఘునాథ్‌నగర్‌ అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌గౌడ్‌, కన్నె రమేష్‌యాదవ్‌, అజయ్‌కుమార్‌ గౌడ్‌, నాగభూషణంచారి, యశ్వంత్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: టమాటా 23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్‌ 55, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్‌ 40, దొండ 18, గుండుబీన్స్‌ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్‌ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 19, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6.

ఖబరస్థాన్‌ కథ మళ్లీ మొదటికే..!

- ఆగిపోయిన అభివృద్ధి
- రూ.5 కోట్లు ఏమయ్యాయి..?
- శ్మశానవాటిక స్థలానికి చట్టబద్ధత లేక.. అందని మరణ ధ్రువీకరణ పత్రాలు



ఆగిపోయిన ముస్లిం ఖబరస్థాన్‌ అభివృద్ధి

సనత్‌నగర్‌: దశాబ్దాల పాటు ఆరడుగుల జాగా కోసం వారు పోరాడారు.. కుటుంబ సభ్యులు ఎవరైనా తనువు చాలిస్తే.. ఆ మృతదేహాలను ఎక్కడ ఖననం చేయాలో అర్థంకాక ధర్నాలు చేసిన సందర్భాలు అనేకం.. గత ప్రభుత్వ హయాంలో మంత్రి హోదాలో కేటీఆర్‌ ఆ బస్తీలో పర్యటించిన సందర్భంలో వారు అనుభవిస్తున్న కష్టాన్ని ఆయనకు వివరించేందుకు నిరసన ప్రదర్శనలకు దిగారు. అంతకుముందు న్యాయబద్ధమైన తమ హక్కును సాధించుకునే క్రమంలో వారు చేసిన ఆందోళనల ఫలితంగా వారిపై కేసులు కూడా నమోదు చేశారు. ఆఖరికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ వారి చిరకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌కు చెందిన ఎకరా స్థలాన్ని ఖబరస్థాన్‌ కోసం కేటాయించారు. అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఆ పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే ఆదిలోనే ఆగిపోయాయి. ఇప్పుడు ఆ నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఇదీ బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ఖబరస్థాన్‌ దుస్థితి.

2009 నుంచి డిమాండ్‌..

ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలంటూ ఓల్డ్‌కస్టమ్స్‌ బస్తీ తహ్రీక్‌ ముస్లిం ఖబరస్థాన్‌ కమిటీ 2009 నుంచి డిమాండ్‌ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో 2014లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఇక్కడి ముస్లిం ఖబరస్థాన్‌కు రెండెకరాల భూమిని కేటాయిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో 2015లో లేఅవుట్‌ సిద్ధం చేసినా 2016లో ఆ స్థలాన్ని ఓపెన్‌ నాలాగా మార్చడంతో అక్కడ ఖబరస్థాన్‌ కేటాయింపును తహ్రీక్‌ ముస్లిం ఖబరస్థాన్‌ కమిటీ వ్యతిరేకించడంతో ఆగిపోయింది. ఆ తర్వాత 2023 ఎన్నికల ముందు హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌ సమీపంలో ఉన్న ఎకరం పైగా భూమిని ఖబరస్థాన్‌కు కేటాయించి అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులు కూడా కేటాయించారు. అయితే ఆ స్థలం వివాదాస్పద భూమిగా 2009లోనే అప్పటి ఖైరతాబాద్‌ ఎమ్మార్వో గుర్తించినట్లు సమాచారం. అయినప్పటికీ గత ప్రభుత్వం ఖబరస్థాన్‌ కోసం స్థలం కేటాయించగా దీనికి ఎలాంటి రాజముద్ర లేదు. చట్టబద్ధత కల్పించలేదు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారికంగా కలెక్టర్‌ ఉత్తర్వులు వెలువడేలా చూడాలని అప్పట్లోనే తహ్రీక్‌ ముస్లిం కమిటీ విన్నవిస్తూ వస్తోంది. అయినప్పటికీ దీనికి చట్టబద్ధత కల్పించలేదు. స్థానికులు కూడా చేసేదేమీ లేక ఇక్కడ కనీస వసతులు లేకపోయినప్పటికీ 2024 నుంచి ఇప్పటివరకు 10 మృతదేహాలను ఖననం చేశారు.

అందని మరణ ధ్రువీకరణ పత్రాలు

ఇక్కడి ఖబరస్థాన్‌కు చట్టబద్ధత లేకపోవడంతో ఇక్కడ ఖననం చేసిన మృతదేహాలకు సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం లేదని స్థానికులు మొత్తుకుంటున్నారు. దీంతో మృతుల కుటుంబీకులు మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా శ్మశానవాటిక నుంచి అధికార లెటర్‌ తీసుకురావాలని చెబుతుండగా, అక్కడ అధికారికంగా లెటర్‌ ఇచ్చేవారు లేకపోవడంతో మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం లేదని తెలుస్తోంది.

సమస్యను పట్టించుకోండి

ఏళ్లుగా ఇక్కడ ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించి అభివృద్ధి చేయాలని పోరాడుతూ వస్తున్నాం. అయితే ఇక్కడ ఎకరం స్థలం కేటాయించినా దానికి చట్టబద్ధత కల్పించకపోవడంతో ఇప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడ ఖననం చేసిన మృతదేహాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేలా చూడాలి. అలాగే అన్ని వసతులతో ఖబరస్థాన్‌ను అభివృద్ధి చేయాలి. అంతకుముందే ఈ ఖబరస్థాన్‌కు చట్టబద్ధత కల్పించాలి. లేదంటే 2016లో గుర్తించిన స్థలాన్ని తిరిగి అభివృద్ధి చేసి కేటాయించాలి.

– సలీంఖాన్‌, తహ్రీక్‌ ముస్లిం ఖబరస్థాన్‌ కమిటీ అధ్యక్షుడు

అలంకారప్రాయంగా తాగునీటి ప్లాంట్‌



నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్‌

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో రోగుల సహాయకులు, సిబ్బంది దాహార్తిని తీర్చేందుకు దివీస్‌ ల్యాబొరేటరీ సంస్థ ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ మూడునాళ్ల ముచ్చటగా మారింది. లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ గాలికి వదిలేయడంతో అలంకారప్రాయంగా తయారైంది. రెండు రోజులుగా ఈ నీటి ప్లాంట్‌ నుంచి చుక్క నీరు రాకపోవడంతో రోగుల సహాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం గాంధీఆస్పత్రిలో పర్యటించిన నేపథ్యంలో నిరుపయోగంగా మారిన ఈ వాటర్‌ప్లాంట్‌ విషయాన్ని పలువురు రోగి సహాయకులు మీడియా దృష్టికి తెచ్చారు. మీడియా ప్రతినిధులు పరిశీలించగా రెండు నల్లాల నుంచి చుక్క నీరు రాకపోవడం గమనార్హం. తక్షణమే నీటి ప్లాంట్‌ ఏర్పాటు చేసిన దివీస్‌ ల్యాబొరేటరీ యాజమాన్యం, గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌ల వితరణ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న వెల్లాల రామ్మోహన్‌

సనత్‌నగర్‌: ప్రభుత్వ రౌండ్‌ టేబుల్‌ స్కూల్‌ విద్యార్థులకు బీజేపీ సీనియర్‌ నేత, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్‌ సోమవారం స్కూల్‌ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో వెంకట సుబ్బారావు, రవి, చలం, శ్రీకాంత్‌, చారి, వాసు, యాదగిరి, శ్రీనివాస్‌, సంతోష్‌, అనురాధ, కుసుమ, గౌతమి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆటగాళ్లలో నైపుణ్యం పెంచడానికి క్రీడా పోటీలు



బహుమతులతో విజేతలు

లాలాపేట: ఆటగాళ్లలో నైపుణ్యాలను పెంచడానికి క్రీడా పోటీలు ఎంతో అవసరమని, తద్వారా క్రీడల్లో రాణిస్తారని ఐఎస్‌సీఏఎస్‌ ఛైర్మన్‌ టి.నవీన్‌కుమార్‌ యాదవ్‌ అన్నారు. క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్‌ ఉందన్నారు. ఈ మేరకు తార్నాక డివిజన్‌ లాలాపేటలోని ప్రొ జయశంకర్‌ ఇండోర్‌ స్టేడియంలో జీహెచ్‌ఎంసీ సహకారంతో డా.టి.కృష్ణా మెమోరియల్‌ 3వ తెలంగాణ స్టేట్‌ వెటరన్స్‌ టేబుల్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌–2025 ఘనంగా నిర్వహించారు. ఏడు కేటగిరీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడా విజేతలకు సోమవారం స్టేడియంలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా టి.నవీన్‌ కుమార్‌ యాదవ్‌, టి.చంద్రకళాకృష్ణ, అసోసియేషన్‌ అధ్యక్షులు దయాకర్‌ కుసుమ, ప్రధాన కార్యదర్శి విఠల్‌ భేతి, సురేష్‌కుమార్‌, ఆచార్య వి.వెంకట్‌ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ రమణకుమార్‌, కె.హరనాథబాబు, బి.ఎం.ఎస్‌ రెడ్డి, హరికృష్ణ, సుకన్య తదితరులున్నారు.

వేడుకలకు పటిష్ట బందోబస్తు

అమీర్‌పేట: ఎల్లమ్మ కల్యాణ వేడుకల సందర్భంగా కల్యాణంతో పాటు రథోత్సవం రోజున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెస్ట్‌ జోన్‌ డీసీపీ విజయ్‌కుమార్‌ తెలిపారు. ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ప్రత్యేక దర్శనాలు, వీఐపీ, సాధారణ దర్శనం కోసం వచ్చే భక్తులకు ఒకేచోట ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తలెత్తాయని గుర్తు చేశారు. ఈ ఏడాది వేర్వేరు చోట్ల ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరం మేరకే వీఐపీ పాసులు జారీ చేయాలని సూచించారు. పాత కక్షలతో దాడులకు పాల్పడ్డ వారితో పాటు జేబు దొంగలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పార్కింగ్‌ కోసం కేటాయించిన స్థలంలోనే భక్తులు తమ వాహనాలను పార్కింగ్‌ చేసుకోవాలని, లేని పక్షంలో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తుతాయని ట్రాఫిక్‌ డీసీపీ హెగ్డే అన్నారు. కల్యాణ మహోత్సవాలకు 80 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు.

గ్రేటర్‌ హైదరాబాద్‌ డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతశోభన్‌ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పలు అంశాలపై డిప్యూటీ మేయర్‌ ఈ సందర్భంగా కొంత సేపు సీఎంతో చర్చించారు.

– లాలాపేట



సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్‌ మహేశ్వరిశ్రీహరి తదితరులు

సనత్‌నగర్‌: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బేగంపేట కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. స్వచ్ఛ భారత్‌–స్వచ్ఛ హైదరాబాద్‌ కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలంటూ సోమవారం శానిటేషన్‌ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దన్నారు. రోడ్ల పక్కన పడేయడంతో అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడి ఈగలు, దోమలు వ్యాప్తి చెందిన అనారోగ్య వాతావరణానికి దారి తీస్తాయన్నారు. ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను అందించాలని సూచించారు. పారిశుధ్య బాధ్యత కేవలం కార్మికులదే కాదని, ప్రజలందరూ బాధ్యత తీసుకుంటేనే స్వచ్ఛ బేగంపేట్‌గా తీర్చిదిద్దవచ్చన్నారు. తద్వారా ఆరోగ్యకర డివిజన్‌గా తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శానిటేషన్‌ సిబ్బందితో పాటు బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీహరి, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏబీవీపీ బస్‌ భవన్‌ ముట్టడి

ఉస్మానియాయూనివర్సిటీ: పెంచిన బస్‌పాస్‌ చార్జీలను తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం బస్‌ భవన్‌ను ముట్టడించనున్నట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీతేజ అన్నారు. ఓయూలో సోమవారం ఆయన మాట్లాడుతూ సకాలంలో ఉపకార వేతనాలు అందక అధిక ఫీజులు, ఇతర ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులపై బస్‌పాస్‌ భారాన్ని మోపడం దుర్మార్గమని మండిపడ్డారు. ఓట్ల కోసం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం ఎలాంటి ఆదాయంలేని విద్యార్థులపై చార్జీల భారం మోపడం దారుణమన్నారు. ఉదయం 11.30గంటలకు జరిగే ముట్టడి కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: వేగంగా వచ్చిన రైలు కిందపడి ఒక వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్‌పీ హెడ్‌ కానిస్టేబుల్‌ డేవిడ్‌ రాజు వివరాల మేరకు.. నేరెడ్‌మెట్‌ వినాయక్‌ నగర్‌కు చెందిన బిల్లా(38) వృత్తి కూలి. సోమవారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో మౌలాలి–అమ్ముగూడ రైల్వేస్టేషన్‌ మధ్య ఉన్న రైల్వే ట్రాక్‌ వద్దకు చేరుకున్న బిల్లా ఎల్‌టీటీ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. బిల్లాకు వివాహ, కుటుంబ సమస్యలు ఉన్న కారణంగా మద్యానికి బానిసై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా శ్రీకాంత్‌



నియామక పత్రం అందుకుంటున్న వాడకట్టు శ్రీకాంత్‌

సనత్‌నగర్‌: నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ కమిషన్‌ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా సనత్‌నగర్‌కు చెందిన వాడకట్టు శ్రీకాంత్‌ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్‌ ప్రెసిడెంట్‌ కటకం శ్రీనివాస్‌గుప్తా, జనరల్‌ సెక్రటరీ వీరేందర్‌, అడ్వైజర్‌ డాక్టర్‌ నీలా శ్రీధర్‌, ఆర్కే గుప్తా, శివకుమార్‌, ఉదయ్‌కుమార్‌, స్వప్న చేతులమీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే హక్కులపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలతో ముందుకుసాగనున్నట్లు చెప్పారు.

వెస్ట్రన్‌ టాయిలెట్స్‌ ఏర్పాటు చేయాలని వినతి



ఆర్థోపెడిక్‌ వార్డులో వెస్ట్రన్‌ టాయిలెట్స్‌ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రవీణ్‌కుమార్‌

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్‌ వార్డుల్లో వెస్ట్రన్‌ టాయిలెట్స్‌ ఏర్పాటు చేయాలని పలువురు రోగులు కోరుతున్నారు. ఈమేరకు గాంధీలో చికిత్స పొందిన ఓ రోగి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి తాను అనుభవించిన ఇబ్బందులను వివరించారు. నగరంలోని లోయర్‌ ట్యాంక్‌బండ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌ నడవలేని స్థితిలో గాంధీ ఆర్థోపెడిక్‌ విభాగంలో ఇన్‌పేషెంట్‌గా చేరాడు. అయితే అక్కడి వార్డుల్లో వెస్ట్రన్‌ స్టైల్‌ టాయిలెట్స్‌ లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు నానా కష్టాలు పడ్డాడు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం గాంధీ ఆస్పత్రిని సందర్శించిన నేపథ్యంలో ప్రవీణ్‌కుమార్‌ మంత్రిని కలిసి వెస్ట్రన్‌ టాయిలెట్స్‌ గురించి వివరించాడు. ఆర్థోపెడిక్‌ విభాగంలో 90శాతం మంది రోగులు నడవలేని, కూర్చోలేని స్థితిలో ఉంటారని, సాధారణ టాయిలెట్స్‌లో కూర్చుని కాలకృత్యాలు తీర్చుకునేందుకు అసౌకర్యానికి గురవుతున్నారని, ఈ కనీస పరిజ్ఞానం టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఇంజనీర్లు, గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగానికి లేకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమస్య పరిష్కరించకుంటే వైద్యశాఖ మంత్రితో పాటు నేషనల్‌ మెడికల్‌ కౌన్సిల్‌, హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ను ఆశ్రయిస్తానని ఆయన అన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి



మల్కాజిగిరి: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌వీ.కర్ణన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అల్వాల్‌ కొత్త చెరువు, సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్‌పై తెలంగాణకు చెందిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. క్యాంప్‌ ఆఫీస్‌కు కార్యాలయం కేటాయించాలని, మచ్చబొల్లారం డివిజన్‌ రైల్వేబజార్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో టన్నెల్‌ విస్తరణకు నిధులు కేటాయించాలని కోరానన్నారు. వివిధ డివిజన్ల వార్డు ఆఫీస్‌లు ప్రజలు ఉపయోగించుకోవడానికి, అల్వాల్‌లో ఫైర్‌స్టేషన్‌, మల్కాజిగిరి ఆర్‌కేనగర్‌లో సబ్‌స్టేషన్‌, బండచెరువు నుంచి వచ్చే వరదనీరు జెట్టీస్‌ క్రాస్‌రోడ్స్‌ మీదుగా లాలాపేటకు తరలించడానికి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. దీనిపై గ్రేటర్‌ కమిషనర్‌ స్పందించారన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం..

- ముంపు నివారణ చర్యలపై కసరత్తు
- త్వరలో పర్యవేక్షక అధికారుల నియామకం
- సర్కిళ్ల వారీగా సమావేశాలు
- జీహెచ్‌ఎంసీ, హైడ్రా తొలి సమావేశం



హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయ సమావేశంలో జీహెచ్‌ఎంసీ జెడ్సీ రవికిరణ్‌

సికింద్రాబాద్‌: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎదురయ్యే ముంపు తదితర విపత్తులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలకు సంబంధించి జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం అధికారులు, హైడ్రా అధికారులు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో జోనల్‌ కమిషనర్‌ ఎస్‌.రవికిరణ్‌ నేతృత్వంలో నిర్వహించిన తొలి సమావేశంలో అధికారుల పరిచయ కార్యక్రమం అనంతరం ముంపు నివారణ చర్యల గురించి కసరత్తు చేశారు. జోన్‌ పరిధిలోని సికింద్రాబాద్‌, బేగంపేట్‌, అంబర్‌పేట్‌, మల్కాజిగిరి, ముషీరాబాద్‌ సర్కిళ్లలో నాలా పరిస్థితులు, ముంపు ప్రమాద తీవ్రత ఉన్న ప్రాంతాల గురించి చర్చించారు.

వాహనాల నిర్వహణ హైడ్రాదే!

గత ఏడాది వరకు ముంపు ప్రమాద బాధితులకు రక్షణ చర్యలు చేపట్టే వాహనాలు, బృందాల నిర్వహణ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండేది. ఈ వర్షాకాలం నుంచి అత్యవసర బృందాలు, వాహనాల ఏర్పాట్లు తదితర వ్యవహారాలన్నీ హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర రక్షణ చర్యల కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు తమతో సమన్వయంతో వ్యవహరించాలని హైడ్రా అధికారులు కోరారు. ఇందుకోసం ఇరు విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి చర్యలు తీసుకునేందుకు చర్చలు జరిపారు. ఇప్పటికే పలు భారీ వాహనాలు హైడ్రా పరిధిలో అందుబాటులో ఉన్నాయని, గల్లీలు, లోతట్టు ప్రాంతాల్లోకి సులభంగా వెళ్లేందుకు టాటాఏసీ వంటి చిన్న తరహా వాహనాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

సర్కిళ్ల వారిగా సమావేశాలు

ముంపు సందర్భాల్లో తక్షణ రక్షణ చర్యలు చేపట్టడం కోసం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకునేందుకు సర్కిళ్ల వారిగా త్వరలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆయా సర్కిళ్లలోని సహాయక ఇంజనీర్లు, హైడ్రా అధికారులు, అత్యవసర బృందాల పర్యవేక్షకులకు మధ్య సయోధ్య కుదుర్చాలనుకున్నారు. ఆ మీదట కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. ముఖ్యంగా నాలాల్లో వరద ఉధృతి, నాలాలు పొంగి లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడం వంటి పరిస్థితులను ముందే అంచనా వేసి, తద్వారా ప్రమాదాలను నివారించే దిశగా అప్రమత్తం కావాలనుకున్నారు.

త్వరలో పర్యవేక్షకుల నియామకం

సర్కిళ్ల వారిగా త్వరలో జరిగే సమన్వయ సమావేశాల్లో విద్యుత్‌, జలమండలి, ట్రాఫిక్‌ పోలీసు అధికారులను భాగస్వాములు చేయాలనుకున్నారు. చెట్లు, విద్యుత్‌ స్తంభాలు నేలకొరగడం, ట్రాఫిక్‌ సమస్యలు ఉత్పన్నం వంటి సందర్భాల్లో చర్యలు తీసుకునేందుకు వాహనాలు, సుశిక్షితులైన బృందాల నియామకం చేపట్టనున్నారు. డివిజన్ల వారిగా ఇంజినీరింగ్‌ విభాగం అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని నిర్ణయించారు. సమావేశంలో హైడ్రా అధికారులుగా ఉన్న డీఎఫ్‌ఓ వై.గౌతమ్‌, స్టేషన్‌ ఫైర్‌ ఆఫీసర్లు పి.దత్తు, వి.సుభాష్‌రెడ్డి, జీబీ చంద్రశేఖర్‌, జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ ఆశాలత, డిప్యూటీ కమిషనర్లు సుభాష్‌రావు, రామానుజయరెడ్డి, మారుతిదివాకర్‌, రాజు. డాకు నాయక్‌ తదితర అధికారులు పాల్గొన్నారు.